
కొల్లాపూర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న జూపల్లి కృష్ణారావు


జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి


కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి


దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి


వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి


నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి


నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి


మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి


అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ


మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

## అలంపూర్ ఎమ్మెల్యేగా విజయుడు

- అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం

అలంపూర్, డిసెంబర్ 9 : హైదరాబాద్‌లోని అసెంబ్లీలో శనివారం అలంపూర్ ఎమ్మెల్యేగా విజయుడు ప్రమాణ స్వీకారం చేశారు. తెలంగాణ భవన్‌లో తోటి ఎమ్మెల్యేలతో కలిసి తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయ శంకర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. శాసనసభలో మొదటిసారి అడుగిడిన సందర్భంగా విజయుడు ప్రమాణ స్వీకారం చేశారు.

## గద్వాల ఎమ్మెల్యేగా కృష్ణమోహన్‌రెడ్డి

- ప్రమాణస్వీకారం చేసిన బండ్ల

గద్వాల అర్బన్, డిసెంబర్ 9 : హైదరాబాద్‌లోని అసెంబ్లీలో శనివారం ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం జరిగింది. అందులో భాగంగా గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా రెండోసారి ఎన్నికైన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా బండ్ల అభిమానులు, నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.


ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుత నీటినిల్వ

## ఆర్డీఎస్ ఆనకట్టకు తగ్గిన ఇన్‌ఫ్లో

అయిజ, డిసెంబర్ 9 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతున్నది. టీబీ డ్యాం నుంచి విడుదలైన ఆర్డీఎస్, కేసీ కెనాల్ జాయింట్ ఇండెంట్ నీరు ఆనకట్టకు చేరకపోవడంతో నిల్వ తగ్గుతున్నది. శనివారం ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో నిలిచిపోగా ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 384 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 7.6 అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. తుమ్మిళ్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు.

**టీబీ డ్యాంకు..**

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 640 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 2,535 క్యూసెక్కులుగా నమోదైంది. 105.788 టీఎంసీల సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 12.494 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. 1,633 అడుగులకు గానూ 1,591.68 అడుగులకు చేరినట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

## మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

జడ్చర్ల, డిసెంబర్ 9 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ఆర్‌ఎన్‌ఆర్ ధా న్యం ధర మరింత పెరిగింది. క్వింటాకు అత్యధికంగా ధర రూ.3,356 పలికింది. మార్కెట్ కు ధాన్యం, మొక్కజొన్న, వేరుశనగ, పత్తి అ మ్మకానికొచ్చాయి. 8,913క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్ రకం అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.3,356 ధర పలుకగా కనిష్ఠంగా రూ.1,769, మధ్యస్తంగా రూ.3,256 ధర ప లికింది. అదేవిధంగా 202క్వింటాళ్ల మొక్కజొ న్న క్వింటాకు గరిష్ఠంగా రూ.2,352 ధర రా గా కనిష్ఠంగా రూ.2,050, మధ్యస్తంగా రూ. 2,341ధర పలికింది. 200క్వింటాళ్ల హంస ధాన్యానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,056 ధర పలికింది. 18క్వింటాళ్ల శ్రీరాంగోల్డ్ రకం ధాన్యం అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,937 పలికింది. 452 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.6,949 ధర పలికింది.


తలపడుతున్న మహబూబ్‌నగర్, ఖమ్మం బాలికల జట్లు

## హోరాహోరీగా ఫుట్‌బాల్ టోర్నీ

జడ్చర్ల టౌన్, డిసెంబర్ 9 : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాలబాలికల ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. శనివారం (రెండురోజు) బాదేపల్లి జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఉమ్మడి 10 జిల్లాలకు చెందిన బాలుర, బాలికల జట్లు తలపడ్డాయి. మొదటగా లీగ్ మ్యాచుల్లో తలపడిన నాలుగు జిల్లాల బాలికల జట్లు సెమీస్‌కు చేరగా, బాలుర జట్లు లీగ్ మ్యాచ్‌ల్లో పోటీపడుతున్నాయి. అండర్17 విభాగంలో 67వ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరుగుతున్న నేపథ్యంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర అసిస్టెంట్ ఆర్గనైజర్ రామకృష్ణ, వనపర్తి జిల్లా ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, అండర్19 ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పాపిరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని అభినందించారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లోని రెండు వేర్వేరు మైదానాల్లో బాలురు, బాలికల ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. వివిధ జిల్లాలకు చెందిన జట్లు మ్యాచ్‌లో తలపడగా పోటీలను తిలకించేందుకు పట్టణవాసులతోపాటు ఫుట్‌బాల్ అభిమానులు అధిక సంఖ్యలో తరలొచ్చారు.

**సెమీస్‌కు చేరిన బాలికల జట్లు**

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో భాగంగా లీగ్ మ్యాచ్‌లు గెలిచిన రంగారెడ్డి, ఖమ్మం, నిజామాబాద్, మెదక్ జిల్లాల బాలికల జట్లు సెమీస్‌కు చేరినట్లు నిర్వాహకులు తెలిపారు. బాలుర విభాగంలో మరిన్ని లీగ్‌మ్యాచులు పూర్తికావాల్సి ఉన్న నేపథ్యంలో ఆదివారం గెలుపొందిన జట్లకు సెమీస్‌తోపాటు ఫైనల్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేశ్‌బాబు, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ మొయిన్, కృష్ణయ్య, బాలరాజయ్య, ఆనంద్, కుమార్, శారదాబాయి, ఉమాదేవి, జ్యోతి, రాములు, రాజవర్ధన్‌రెడ్డి, వెంకటమ్మ, టోర్నమెంట్ పరిశీలకులు ప్రేమ్‌కుమార్, భావన, అంఫైర్స్ వడెన్న, భానుకిరణ్, రాము, నరేశ్, శ్రీకాంత్, నిఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కురుమూర్తి బ్రహ్మోత్సవం

- జాతరకు భారీగా తరలొచ్చిన భక్తులు


కురుమూర్తి స్వామి మూలవిరాట్

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), డిసెంబర్ 9: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలో పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. కార్తీకమాసం, సెలవుదినం కావడంతో శనివారం భక్తులు కురుమూర్తి కొండకు భారీగా తరలొచ్చారు. భక్తిశ్రద్ధలతో పుణ్యస్నానాలు చేసి స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. దాసరులకు దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.


రద్దీగా ఆలయ పరిసరాలు

## పురాతన శిల్పాలను కాపాడుకోవాలి

- పురావస్తు పరిశోధకుడు నాగిరెడ్డి

మానవపాడు, డిసెంబర్ 9 : పురాతన శిల్పాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో శివనాగిరెడ్డి అన్నారు. సురవరం ప్రతాప్‌రెడ్డి సాహితీ వైజయంతి ట్రస్ట్ సమన్వయకర్త సురవరం గిరిధర్‌రెడ్డి ఆహ్వానం మేరకు చండూరులోని కల్యాణ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న క్రీ.శ 8–9 శతాబ్దాల నాటి నాగదేవత శిల్పాలు, క్రీ.శ 11–12 శతాబ్దాలకు చెందిన వీరగల్లులు, క్రీ.శ 13వ శతాబ్దానికి చెందిన భైరవ, సూర్యశిల్పాలు, 16వ శతాబ్దం నాటి చెన్నకేశవ శిల్పం, 18వ శతాబ్దానికి చెందిన దంపతుల శిల్పాలు, చాళక్య కాలపు గణపతి, శివలింగం, నంది విగ్రహాలను పరిశీలించి వాటి ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో బొమ్మారెడ్డి రామిరెడ్డి, శంకర్‌నాయుడు, రామానాయుడు, కృష్ణయ్య, ఈశ్వరయ్య తదితరులున్నారు.